సాక్షి తూర్పుగోదావరి

గురువారం | 25 | జూలై | 2024



సంతాన ప్రాప్తిరస్తు

అమ్మా నాన్నా అనే అనే పిలుపు కోసం దంపతులు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. పిల్లల కోసం ఎన్నో కలలు కంటుంటారు. వారికి ఐవీఎఫ్ కేంద్రాలు అండగా ఉంటున్నాయి. -8లో..



అంతా మా ఇష్టం..

స్టూడెంట్ల కిట్ల పంపిణీలోనూ తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారు. అంతా తమ ఇష్టమే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. -8లో..

ఆర్యాపురం ఎన్నికల్లో ధైర్యంగా పోటీ చేశాం



అధికారంలో లేనప్పటికీ ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నికలలో ధైర్యంగా పోటీ చేశామని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. -8లో..

న్యూస్‌రీల్

తపాలా సేవలకు ప్రాచుర్యం

పోస్టల్ ఎస్పీ శేషారావు

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత సేవలు ప్రజాబాహుళ్యంలోకి నేరుగా ప్రచారం చేయడం కోసం ఏర్పాటు చేసిన తపాలా గ్రామ సభపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కోట శేషారావు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో తపాలా సంస్థ ప్రవేశ పెట్టిన సరికొత్త కార్యక్రమం తపాలా గ్రామసభ (డాక్ చౌపల్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ వినూత్న కార్యక్రమం సెప్టెంబర్ 30 తేదీ వరకు దేశవ్యాప్తంగా 5,000 కేంద్రాలలో నిర్వహిస్తున్నారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులను, ప్రాథమిక చికిత్సా కేంద్రానికి సంబంధించిన ఆరోగ్యశాఖ అధికారులను, స్థానిక నాయకులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి, తపాలా శాఖ పథకాలు, సేవల గురించి వివరిస్తున్నామన్నారు. పోస్టాఫీసు పొదుపు, తపాలా బీమా, ఆధార్ కార్డు నమోదు, నవీకరణ, పాస్‌పోర్ట్, ఇండియా పోస్ట్ చెల్లింపుల సేవలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి ఉన్నాయని తెలిపేందుకు తపాలా గ్రామ సభ నిర్వహిస్తున్నామన్నారు. చెరుకూరి శ్రీనివాస్, డాక్టర్ పి.బాబూరావు, జి.సువర్ణరాజు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం - హక్కులపై అవగాహన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్వాతి మహిళ సంఘం, నారీ సాక్ష్యం ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో స్థానికంగా ఓ హోటల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు మాట్లాడుతూ మహిళలకు భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల గురించి వివరించారు. మహిళా చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. మహిళలు హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. ఉచిత న్యాయ సహాయం అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, సూపరింటెండెంట్ గవర్నమెంట్ టీచింగ్ జనరల్ హాస్పిటల్ ఎం.లక్ష్మీసూర్యప్రభ, మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.వీరేంద్రనాథ్, ఏఆర్‌టి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి కిరణ్, ప్రోగ్రాం ఆఫీసర్ మానస పాల్గొన్నారు.



నిడదవోలు మండలం కంసాలిపాలెంలో ఎర్రకాలువ ముంపుతో కుళ్లిన వరిచేలు



పెరవలి మండలం ముక్కామలలో జల దిగ్బంధంలోనే పంటలు



కానూరులో మునుగుతున్న జామ తోట

శాంతిస్తున్న గోదావరి

- భద్రాచలంలో తగ్గిన వరద ప్రవాహం
- రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నిలకడగా నీటిమట్టం
- 14.70 అడుగుల వద్ద కొనసాగుతున్న నీటి ప్రవాహం
- మరింతగా తగ్గే అవకాశం
- బ్యారేజీ నుంచి 3,900 క్యూసెక్కుల నీరు కాలువలకు విడుదల
- 14.13 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలోకి..
- ముంపు నుంచి తేరుకుంటున్న గ్రామాలు
- కుళ్లిపోయిన వరి

సాక్షి, రాజమహేంద్రవరం: నిర్మలంగా ఉండే గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువన భారీ వర్షాలు కురవడంతో గోదావరిలోకి వరద నీరు వచ్చి చేరింది. నురగలు కక్కుతూ.. రంగు మార్చుకుని ఉధృతంగా ప్రవహించింది. వారం రోజుల పాటు గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. తెలంగాణలోని ప్రాజెక్టుల నుంచి మిగులు జలాలు దిగువకు విడుదల చేయడంతో ఈ నెల 18వ తేదీ నుంచి గోదావరి ఉధృతి పెరుగుతూ వచ్చింది. మొదట్లో ఎప్పటిలాగే గోదావరి ఓ మోస్తరు ఉధృతికి చేరిన అనంతరం సాధారణ స్థితికి చేరుకుంటుందని అంచనా. అందుకు తగ్గట్టుగానే గోదావరి వరద ప్రవాహం బుధవారం కాస్త శాంతించింది. భద్రాచలం వద్ద నీటిమట్టం ఉదయం నుంచి తగ్గుతూ వస్తోంది. ఉదయం 7 గంటల సమయంలో 47.40 అడుగులు నీటిమట్టం ఉండగా.. సాయంత్రం 6 గంటలకు 45.20 అడుగులకు తగ్గుముఖం పట్టింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ ప్రభావంతో సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ఉదయం 7 గంటల సమయంలో నీటిమట్టం 14.90 అడుగులు ఉండగా.. సాయంత్రం 6 గంటలకు 14.70 అడుగులకు చేరింది. రాత్రికి ఇది మరింతగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. బ్యారేజీ నుంచి 3,900 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదులుతుండగా.. 14,13,251 క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది.



పెరవలి మండలం ఉసులుమర్రులో నీటమునిగిన పచ్చిమిరపతోట

కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతూ వచ్చిందిలా..

సమయం	నీటి మట్టం (అడుగుల్లో)	విడుదల చేసిన మిగులు జలాలు (క్యూసెక్కుల్లో)
ఉదయం 7 గంటలు	14.90	14,56,651
మధ్యాహ్నం 1 గంట	14.80	14,42,005
5 గంటలకు	14.70	14,18,752

తేరుకుంటున్న గ్రామాలు

గోదావరిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో నీటి ముంపునకు గురైన గ్రామాలు స్వల్పంగా తేరుకుంటున్నాయి. గ్రామాలను చుట్టుముట్టిన వరద నీరు క్రమంగా తగ్గుతోంది. పొలాలు మాత్రం నీటిలో ఉన్నాయి.



తొర్రేడులో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవరావు

- తాళ్లపూడి మండలంలో గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. వేగేశ్వరంలంక గ్రామాన్ని వరద నీరు వచ్చి తాకుతోంది. కొవ్వాడ కాలువ ప్రవాహ ఉధృతి కొనసాగుతోంది. రాగోలపల్లి నుంచి తాళ్లపూడి వెళ్లే రహదారి, అన్నదేవరపేట–వేగేశ్వరం వైపు వెళ్లే కల్వర్టుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి.

– నల్లజర్ల మండలంలో ఎర్రకాలువ ఉధృతితో జల దిగ్బంధంలో చిక్కుకున్న చోడవరం, గుండేపల్లి గ్రామాలు ప్రవాహ ఉధృతి కొంతమేర తగ్గింది. గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో గోపాలపురం, వాదలకుంట, జగన్నాథపురం, దొండపూడి, చిట్యాల, అనంతం పల్లి, తదితర కాలనీల్లోకి నీరు కొద్దిమేర తగ్గుముఖం పట్టింది.

- పెరవలి మండలంలో గోదావరి వరద ప్రభావం మరింతగా పెరిగింది. ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి తగ్గితే ఇక్కడ పెరుగుతుంది. ఇందులో భాగంగా రాత్రికి రాత్రే ఉధృతమైంది. బుధవారం ఉదయం ఎగువ లంకలను సైతం ప్రవాహం ముంచెత్తడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల పరిధిలో సాగైన కోకో, అరటి, కంద, పసుపు, పామాయిల్, చెరకు, జామ, బొప్పాయి, కొబ్బరి, తమలపాకు, కూరగాయల పంటలు, పూలతోటలు, మొక్కజొన్న తోటలు నీటిలో మునిగిపోయాయి. వాణిజ్య పంటలైన కంద, పసుపు సైతం దెబ్బతిన్నాయి.

నీళ్లలోనే పొలాలు

గోదావరి వరద ఉధృతి కారణంగా పంట పొలాల్లోని నీరు భారీగా వచ్చి చేరడంతో వారం రోజుల నుంచి పొలాలు నీటిలోనే ఉన్నాయి. నీటి ఉధృతికి వరి, ఉద్యాన పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రోజుల తరబడి లంకల్లోని పంటలు నీట మునగడంతో రైతులకు దిక్కుతోచడం లేదు.

12,995 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వరద ప్రభావంతో సాగు చేసిన 45 రోజుల వ్యవధిలో 12,955 హెక్టార్లలో వరి, చెరకు, మినుము పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 53,550 హెక్టార్లలో సాగు చేయగా.. 19,133 హెక్టార్లలో నీట మునిగింది. 16 మండలాల్లో వరద ప్రభావం కొనసాగింది. 16,579 మంది రైతులకు చెందిన పంట దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. 43 హెక్టార్లలో నారుమళ్లు నీట మునిగినట్టు లెక్కగట్టారు. అత్యధికంగా నిడదవోలులో 3,392 హెక్టార్లలో వరి నాట్లు, 20 హెక్టార్లలో చెరకు పంట నీటిపాలయ్యాయి. ఉండ్రాజవరంలో 3,500 హెక్టార్లలో వరి నాట్లు నీట మునిగాయి. సీతానగరంలో 3,120 హెక్టార్లు, తాళ్లపూడిలో 501 హెక్టార్లు వరి, 20 హెక్టార్ల చెరకు, నల్లజర్లలో 400 హెక్టార్ల వరి, రాజానగరంలో 425 హెక్టార్లలో వరి నాట్లు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లెదుటే కుళ్లిపోతుంటే ఆవేదన చెందుతున్నారు. పంటల సాగుకు అనుకూల సమయం వచ్చిందని సంతోషిస్తే ప్రకృతి ప్రకోపానికి బలయ్యామని వాపోతున్నారు. వరద తమను అప్పుల పాలు చేసే వరకు వదిలేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు సొమ్ము ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదంటున్నారు. నారుమళ్లు, వరి నాట్లు, అరటి, బొప్పాయి, మినుములు నీట మునిగి కుళ్లిపోతున్నాయి. పశుగ్రాసానికి సైతం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలోని లంక భూముల్లో వరద కారణంగా ముంపులో చిక్కుకున్న పంటలు



పెరవలి మండలం కానూరు అగ్రహారం కాజ్‌వేపై ఉధృతంగా వెళుతున్న నీరు



కానూరు అగ్రహారంలో నీటమునిగిన కూరగాయల పందిర్లు

నీరు మడులు

- నిండాముంచిన భారీ వర్షాలు
- ముంపు బారిన 55 వేల ఎకరాలు
- కుళ్లిపోతున్న నాట్లు, నారుమళ్లు

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు తోడై ఖరీఫ్ రైతులను నిండా ముంచేశాయి. ప్రభుత్వం నుంచి సాయం అందక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి కాస్తా గోదాట్లో కలిసిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వాతావరణం సానుకూలంగా ఉందని గంపెడాశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతుకు సీజన్ ప్రారంభంలోనే కష్టాలు ఎదురయ్యాయి. నారుమళ్లు, వేసిన నాట్లు ముంపు పాలవ్వడంతో ఏం చేయాలో తెలియడం లేదు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఈస్టర్న్, సెంట్రల్ డెల్టాల ఆయకట్టు రైతుల కష్టం వర్షార్పణమైంది.

రైతుల ఆవేదన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలలో నాట్లు ముంపు నీటిలోనే నానుతున్నాయి. ఈ రోజుకాకపోతే రేపు, రేపు కాకుంటే ఎల్లుండి వర్షాలు తగ్గుతాయని వారం రోజులుగా రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాలు తగ్గి ముంపు నీరు లాగితే నాట్లు ఊపిరిపోసుకుంటాయని ఎదురు చూశారు. తగ్గినట్టే తగ్గి మళ్లీ వచ్చి కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద కూడా తోడైంది. ఇక పెట్టుబడులపై ఆశలు వదిలేసుకునే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు బారిన వేల ఎకరాలు

ఏ డెల్టాలోని ఏ ఆయకట్టును పరిశీలించినా నాట్లు వేసిన వరి పొలాలు, నారుమళ్లు నిండా మునిగిపోయి గోదావరిని తలపిస్తున్నాయి. వరదలతో పంట కాలువలు, డ్రైన్‌లు సమాంతరంగా తన్నిపెట్టడంతో నీరు ఎటు దిగే అవకాశం లేక ఇప్పటికిప్పుడు ముంపు నుంచి బయటపడే అవకాశం కనిపించడం లేదు. రెండు డెల్టాల పరిధిలో వేలాది ఎకరాలు ముంపులో ఉండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చేతికొచ్చాయనుకుంటున్న నారుమళ్లు కళ్లెదుటే ముంపు బారిన పడటం కోలుకోలేని దెబ్బతీసింది. పొలంలో ముంపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో నారుమళ్లు, నాట్లు కుళ్లిపోయి, తీవ్రంగా నష్టపోవడం ఖాయంగా కనిపిస్తోందని రైతులు కంటతడి పెడుతున్నారు. చేల గట్లపై కూర్చుని నిండా మునిగిన నాట్లు చూసుకుంటూ బాధపడుతున్నారు.



తాళ్లరేవులో ముంపులో ఉన్న పొలాన్ని చూపుతున్న రైతు

పంట నాశనం



రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరిచేను ముంపునకు గురైంది. ఎడతెరిపిలేని వర్షం కురవడంతో చేలో నీరు దిగడం లేదు. వరినాట్లు కుళ్లిపోయి పాడైపోతున్నాయి. ఇప్పటికైనా వర్షం తగ్గకపోతే పంట నాశనం అయిపోయినట్లే. ఇప్పటికే సుమారు పది వేల రూపాయలు ఖర్చయింది. పాడైపోయిన నాట్లను తిరిగి వేయాలన్నా ఎక్కడా ఆకు దొరికే పరిస్థితి కూడా లేదు.

– అనిశెట్టి బుల్లయ్య, రైతు, లచ్చిపాలెం, తాళ్లరేవు మండలం

పెట్టుబడి గంగపాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలలో గోదావరి కాలువపై ఆధారపడిన ఆయకట్టు రైతులు కన్నీటి కడగండ్లలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పుడున్న ముంపు పరిస్థితులు చూస్తుంటే నాట్లు వేసిన పొలాల్లో ప్రతి ఎకరాకు రైతులు రూ.14 వేల నుంచి రూ.19 వేలు నష్టపోనున్నారు. ఖరీఫ్‌లో నారుమడికి రూ.2 వేలు, దమ్ములకు రూ.4 వేలు, పట్టితోలు, విత్తనాలకు కలిపి రూ.2 వేలు, ఊడ్పులకు రూ.6 వేల వంతున పెట్టుబడి పెట్టారు. నారుమడికి పెట్టుబడిలు తడిసి మోపెడయ్యాయి. విత్తనాలకు రూ.1,200, దమ్ము, గట్టులంకలు, ఎరువులకు కలిపి రూ.4,500 ఖర్చు చేశారు. ఈ పెట్టుబడి అంతా గంగలో కలిసిపోయి నష్టీనని రైతులు మదనపడుతున్నారు.

సన్నగిల్లిన ఆశలు

పొలాల్లోని ముంపు నీరు దిగుతుందనే ఆశలు కూడా రైతులకు సన్నగిల్లిపోయాయి. వర్షాలు ఇప్పటికిప్పుడు నిలిచిపోతే గనక కనీసం ఒక వంతు అయినా దక్కుతుందని ఆశ పడుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మరోసారి నారు పోయాలన్నా, నాట్లు వేయాలన్నా ఆచరణ సాధ్యమయ్యే పనేనా అని తలపట్టుకుంటున్నారు. కోనసీమ జిల్లాలోని కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు, కొవ్వూరు, అనపర్తి, కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, కాకినాడ రూరల్, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఖరీఫ్ పంట ముంపు బారిన పడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రాథమిక అంచనాలు

ముంపులో ఉన్న నాట్లు, నారుమళ్లపై యంత్రాంగం ప్రాథమిక అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు నాట్లు పూర్తి అయిన వరి పొలాలు 55 వేల ఎకరాలు పైమాటగానే ఉన్నట్టుగా తేలింది. అదే నారుమళ్ల లెక్కలు కడితే 1,400 ఎకరాలు పైబడే ముంపులో ఉన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 559 గ్రామాల్లో వరి పంట, నారుమళ్లు నీట మునిగాయి. ఈ గ్రామాల్లో తక్కువలో తక్కువ లెక్కేస్తే 40 వేల మంది రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉంది.

జిల్లాల వారీగా..

కాకినాడ జిల్లాలో వర్షాలకు 2,730 హెక్టార్లలో నాట్లు, 311 హెక్టార్లలో నారుమళ్లు నీట మునిగాయి. 130 గ్రామాల్లో వరిచేలు ముంపులో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 204 గ్రామాల పరిధిలో 2,754 హెక్టార్లలో వరి చేలు ముంపులో ఉండగా, 203 హెక్టార్లలో నారుమడులు నీట మునిగాయి. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 18 మండలాల పరిధిలో 225 గ్రామాలలో వరి పంట ముంపులో ఉంది.

రైతులను ఆదుకోవాలి



ఆగకుండా ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి నాట్లు మునిగిపోయి కుళ్లిపోయాయి. ఎకరం పెట్టుబడి రూ.14 వేలకు పైనే ఖర్చయ్యింది. తిరిగి దుక్కు దున్ని నాట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు అదనంగా మరో రూ.5 వేల వరకూ పెట్టుబడి అయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలి.

– మొరంపూడి శ్రీరంగనాయకులు, రైతు, జి.మేడపాడు, సామర్లకోట మండలం

ఏం చేయాలో తెలియడం లేదు



తుపాను వల్ల కురుస్తున్న వర్షాలకు వరినాట్లు ముంపునకు గురయ్యాయి. అందినకాడికి అప్పు చేసి ఎకరాకు రూ.14 వేల వంతున పెట్టుబడి పెట్టాను. నారుమడికి రూ.2 వేలు, దమ్ముకి రూ.4 వేలు, పట్టితోలు, విత్తనాలకు రూ.2 వేలు, ఊడ్పులకు కలిపి రూ.6 వేలు ఖర్చు అయ్యింది. నారుమడికి మరో రూ.5,700 అదనం. ఇప్పుడు ఏంచేయాలో తెలియడం లేదు.

– బండే వీరబాబు, రైతు, వేములవాడ, కరప



సామర్లకోట మండలం మామిళ్లదొడ్డిలో నీట మునిగిన వరి నాట్లు

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న జిల్లా నేతలు



ధర్నా సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. పక్కన మాజీ ఎంపీ భరత్‌రామ్



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు



ధర్నాలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న ఆటవిక పాలనను యావత్ దేశం దృష్టికి తీసుకువెళ్లేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో ధర్నా నిర్వహించారని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ దమన కాండకు నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కలసివచ్చే అన్ని పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ధర్నా విజయవంతమైందని తెలిపారు.

లింగ వివక్ష లేకుండా అవగాహన

కలెక్టర్ ప్రశాంతి



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లింగ వివక్ష లేని సమాజం, మహిళా సాధికారత దిశగా భారత ప్రభుత్వం బేటీ బచావో, బేటీ పఢావో పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలో బేటీ బచావో, బేటీ పఢావో, బాల్యవివాహాలు నియంత్రణ, తల్లి బిడ్డల సంరక్షణ వంటి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె సమీక్షిస్తూ ఆడపిల్లలను చదివించడం, లింగ పక్షపాతానికి వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాలికల సంక్షేమ సేవల సామర్థ్యాన్ని మెరుగుపరిచే విధంగా పథకం లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. బాల్య వివాహాలు జరిగే సమాచారం క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి తెలుసుకునే అవకాశం ఉందని, సామాజిక బాధ్యతతో అటువంటి వాటిని బహిర్గతం చేసేలా ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం విస్తృత ప్రచారంలో భాగంగా టేబుల్ స్టాంప్స్, కరపత్రాలు, వార్తా పత్రికలు, సోషల్ మీడియా వంటి వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేసే విధంగా చర్య చేపట్టాలన్నారు. గృహ హింస కేసుకు సంబంధించి వెంటనే ఎఫ్ఐఆర్ ఫైల్ చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 1,556 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న నెలసరి పనితీరుపై సమీక్షలు పక్కాగా నిర్వహించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. శాఖా పరంగా నిర్వహిస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలను క్యాలెండర్ రూపంలో ముందస్తుగానే నిర్ణయించి ఆయా తేదీల్లో అవగాహన సమావేశాలను నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ, మండల కార్యాలయ కేంద్రాల్లో గల ఖాళీ స్థలాల్లో న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి, సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీచ్ ఒడ్డున వ్యక్తి మృతదేహం

సఖినేటిపల్లి: పల్లిపాలెం బీచ్ ఒడ్డుకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చిందని ఎస్సై ఎస్.రాము తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై తెల్లని చొక్కా, సిమెంట్ రంగు నిక్కరు ఉన్నాయన్నారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉన్నట్టు, దాదాపు వారం రోజుల క్రితం చనిపోయినట్టు భావిస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96566కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం



మునిపల్లిలో కాలిపోయిన తాటాకిల్లు

ఉప్పలగుప్తం: మునిపల్లి పంచాయితీ పరిధి కోటిగట్టు ప్రాంతానికి చెందిన తిరుకోటి సురేష్ తాటాకిల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. సురేష్ ఉపాధి కోసం విజయవాడకు వెళ్లాడు. అతడి భార్య, ఇద్దరు కుమార్తెలు తాటాకింటిలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒక్కసారిగా మంటలు రావడంతో సురేష్ భార్య, పిల్లలిద్దరూ బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, తహసీల్దార్ టి.మల్లికార్జునరావు, వీఆర్వో మమత, కార్యదర్శి పి.వెంకటరమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు తక్షణ సాయం అందించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1 లక్ష ఆస్తి నష్టం జరిగిందని తహసీల్దార్ తెలిపారు.

సంతాన ప్రాప్తిరస్తు

- దంపతుల్లో పెరుగుతున్న సంతానలేమి
- ఆధునిక జీవనశైలితో సమస్యలు
- అందుగా సంతాన సాఫల్య కేంద్రాలు
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే



కొత్తపేటలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్

కొత్తపేట: అమ్మా నాన్నా అనే అనే పిలుపు కోసం దంపతులు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. పిల్లల కోసం ఎన్నో కలలు కంటుంటారు. అయితే ఆధునిక జీవనశైలి కారణంగా సంతానలేమి సమస్యలు పెరిగిపోతున్నాయి. వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగక బాధపడుతున్న దంపతులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. అలాంటి వారికి సంతానం కలగడానికి వైద్యసేవలు అందించే ప్రత్యేక ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్లు నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. మెట్రోపాలిటన్ సిటీలు, పట్టణ ప్రాంతాలతో పాటు కొత్తపేట, రావులపాలెం లాంటి గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఇంగ్లాండ్‌లోని డాక్టర్ కెర్షాస్ కాటేజ్ హాస్పిటల్‌లో 1978 జూలైలో ఐవీఎఫ్ ద్వారా లూయిస్ బ్రౌన్ అనే బిడ్డ జన్మించింది. మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీగా రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా జూలై 25న వరల్డ్ ఐవీఎఫ్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

జీవన శైలి

పెళ్లి కాకముందు పప్పన్నం ఎప్పుడు పెడతావు అంటూ బంధువులు, పెద్దలు అడుగుతూ ఉంటారు. పెళ్లయిన తరువాత ఎంతమంది పిల్లలు అంటూ ఆరా తీస్తారు. అయితే ఈ రోజుల్లో చాలా మంది దంపతులకు తొందరగా పిల్లలు పుట్టడం లేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఆలస్యంగా పెళ్లి కావడం, ఒత్తిడి తదితర సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో పిల్లల కోసం ఎదురు చూస్తున్న వారికి ఐవీఎఫ్ సెంటర్లు ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. వీటి ద్వారా అనేక మంది అమ్మానాన్నలుగా మారుతున్నారు. పిల్లల బుడిబుడి అడుగులతో వారి ఇళ్లలో సందడి నెలకొంటోంది.

కారణాలివే..

సంతానలేమికి అనేక కారణాలు ఉన్నాయి. మగవారిలో బీపీ, సుగర్ వంటి వ్యాధుల కారణమవుతున్నాయి. పొగతాగడం, ఆల్కహాల్, డ్రగ్స్, కొన్ని రకాల మందులు వాడటం, సుఖ వ్యాధులు, టీబీ, వృషణాలకు గాయాలవ్వటం కూడా సమస్యలను కలిగిస్తున్నాయి. అలాగే ఆడవాళ్లకు సంబంధించి 35 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకోవటం, ఆలస్యంగా రజస్వల కావడం, అండం విడుదల కాకపోవడం, హార్మోన్ల సమస్య, గర్భసంచి, కడుపులో ఇన్ఫెక్షన్లు, గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవటం, పీసీఓడీ, జునైటైల్ టీబీ, బీపీ, సుగర్, జీవనశైలి, అధిక మానసిక ఒత్తిడి, అధిక బరువు, అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవటం వల్ల సంతానం కలగడం లేదు.

మరికొన్ని కారణాలు

పెళ్లైన ఏడాది పాటు ఎలాంటి గర్భనిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవటాన్ని వంధ్యత్వం (ఇన్ఫెర్టిలిటీ) అంటారు. అలాగే కంప్యూటర్ వద్ద ఆరు నుంచి 8 గంటల పాటు పనిచేయడం, రాత్రి వేళల్లో ఎక్కువగా సెల్ ఫోన్ వాడడం, వీర్యకణాలు తక్కువగా ఉండటం, రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం, హార్మోన్ సమస్యలు, గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం వల్ల సమస్యలు వస్తున్నాయి.

అత్యాధునిక వైద్యం

సంతానలేమితో బాధపడేవారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. సంతానం కోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలోకి పంపిస్తారు. భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానంలో, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా వృషణాల నుంచి సిరంజి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి, పిండాన్ని తయారు చేస్తారు. ఇంట్రా యుటైన్ ఇన్సెమినేషన్ (ఐయూఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్య రీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా (అద్దెగర్భం) సంతానం పొందవచ్చు.

వైద్య పరీక్షలు



గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్‌ల్యూసెన్సీ (ఎన్టీ) స్కాన్ చేయించాలి. డబుల్ మార్కర్, క్రోమోజోమ్ ఎనాలసిస్, సుగర్, రక్తహీనత పరీక్షలు జరపాలి. 18 వారాల నుంచి ఐరన్ మాత్రలు, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలి. గర్భం దాల్చిన 20 నుంచి 22 వారాల్లోగా టీఫా స్కాన్ పరీక్ష చేయిస్తే గర్భంలో ఉండే బిడ్డ గుండె, తల, శరీరం, ఎముకల్లో ఎదుగుదల లోపాలను తెలుసుకోవచ్చు. 24 వారాల తరువాత బీపీ, సుగర్ పరీక్షలు చేయించాలి. 32 వారాలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, సీటీజీ చేయించాలి.

– డాక్టర్ ప్రదీప్తి కరుణ, స్త్రీ,ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, కొత్తపేట

మంచి ఫలితాలు



సంతానం లేక బాధపడేవారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా అనేక మంది దంపతులు సంతానం పొందుతున్నారు. రావులపాలెం, కొత్తపేట ప్రాంతాల్లో అత్యాధునిక చికిత్సా పద్ధతులను అందుబాటులోకి తీసుకు వచ్చాం. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టేందుకు 23 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయసు చాలా అనుకూలం. ఫోలిక్ యాసిడ్ గర్భం దాల్చేందుకు ముందుగానే మింగటం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అనుమతులు ఉన్న ఐవీఎఫ్ కేంద్రాల్లోనే చికిత్స పొందాలి.

– డాక్టర్ ఎంఆర్ఎల్ భీమారెడ్డి, ఎంఎస్ ల్యాప్రోస్కోపిక్ స్పెషలిస్టు, రావులపాలెం

శ్లాబ్ పెచ్చులు పడి దంపతులకు గాయాలు



బాధితురాలిని పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: భారీ వర్షాలకు ఇంటి శ్లాబ్ పెచ్చులు పడి దంపతులు గాయపడ్డారు. స్థానిక 23వ వార్డు లింగంపల్లిలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. ఇంటిలో నిద్రిస్తున్న బల్ల పుల్లయ్య, లక్ష్మమ్మ దంపతులపై శ్లాబ్ పెచ్చులు పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారికి స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దంపతులను పరామర్శించారు. మున్సిపల్ కమిషనర్ రాం భూపాల్‌రెడ్డి, మద్దిపాటి ఫణీంద్ర, మున్సిపల్ ఏఈ హేమంత్, టౌన్ ప్లానింగ్ అధికారి సుజాత తదితరులు ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

సీతానగరం: గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా చినకొండేపూడికి చెందిన మేరిన వీరబాబుపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆ బాలిక అదృశ్యం కావడంతో ఈ నెల 11వ తేదీన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే బాలిక తిరిగి రావడంతో పోలీసులు విచారణ జరిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వీరబాబుపై పోక్సో కేసు నమోదు చేశారు.

సుస్థిర లక్ష్యాల సాధనకు శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

సామర్లకోట: గ్రామాలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని సాధించేలా సుస్థిర లక్ష్యాల సాధనకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు విస్తరణ శిక్షణా కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలలోని వివిధ శాఖల అధికారులకు రెండవ బ్యాచ్‌లో నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 11 జిల్లాలలోని వివిధ శాఖల అధికారులకు మూడు బ్యాచ్‌లలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. రెండో బ్యాచ్‌లో బాలల వికాస గ్రామం అనే అంశంపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో నేర్చుకున్న అంశాలకు సంబంధించి రాత పరీక్ష నిర్వహించి, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. విద్య, ఆరోగ్యం, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఫ్యాకల్టీలు జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, కె.నిహారిక, ప్రసాద్, పద్మజన, వెంకటేశ్వర్లు, చక్రపాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం..

- స్టూడెంట్ కిట్ల పంపిణీలో హైడ్రామా
- టీడీపీ నాయకుల రాజకీయాలు
- అల్లిపూడి కేజీబీవీలో ఘటన



అల్లిపూడి కేజీబీవీలో విద్యార్థినికి స్టూడెంట్ కిట్ అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

కోటనందూరు: స్టూడెంట్ల కిట్ల పంపిణీలోనూ తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారు. అంతా తమ ఇష్టమే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల అవసరాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచిన రోజునే విద్యాకానుక పంపిణీ మొదలయ్యేది. దాదాపు వారం లేదా పది రోజులలో పూర్తి చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచి దాదాపు 40 రోజులుగా దాటుతున్నా ఇంకా కొనసాగుతూనే ఉంది. కోటనందూరు మండలం అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్టూడెంట్ కిట్ పంపిణీ కార్యక్రమంలో హైడ్రామా నడిచింది. దీంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు.

వివరాలు ఇవీ..

అల్లిపూడి కేజీబీవీలో మండల స్థాయిలో స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి మండల స్థాయి ప్రజాప్రతినిధులతో పాటు టీడీపీ మండల నాయకులను ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకే హాజరు కావాలని మండల విద్యాశాఖ అధికారులు కోరారు. నిర్ణీత సమయానికే ఎంపీపీ లగుడు శ్రీనివాసు కేజీబీవీకి చేరుకున్నారు. కానీ టీడీపీ నాయకులు మాత్రం రాలేదు. సమయం మించిపోయినా వారి నుంచి స్పందన లేదు. దీంతో వారికి పలుమార్లు అధికారులు ఫోన్లు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు సమావేశానికి రాకపోగా వారం రోజుల తరువాత ఎమ్మెల్యే వస్తారు, అప్పటి వరకూ సమావేశాన్ని వాయిదా వేయాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీంతో పది రోజుల తరువాత సమావేశం నిర్వహిస్తామని, సహకరించాలని ఎంపీపీ శ్రీనివాస్‌ను విద్యాశాఖ, కేజీబీవీ సిబ్బంది కోరారు. ఆగ్రహించిన ఎంపీపీ అధికారిక కార్యక్రమానికి పిలిచి అవమానిస్తారా? అని సిబ్బందిని ప్రశ్నించారు. ఏదేమైనా పంపిణీ చేసే వెళతానని స్పష్టం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విద్యాశాఖ, పంచాయతీరాజ్‌శాఖల సిబ్బంది అక్కడ నుంచి వెళ్లిపోయారు. చివరికి కేజీబీవీ ఎస్ఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీపీ శ్రీనివాసు విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, తరిపే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌టీసీ వైద్యాధికారి బదిలీ

- ఉద్యోగి రాధాకృష్ణకు వేధింపుల ఫలితం
- బుధవారం రాత్రి కలెక్టర్ ఆదేశాలు



కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీఎన్‌జీవో నాయకులు

కాకినాడ క్రైం: ఫైలేరియా రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఐ.సాయి రోహితను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో అదే విభాగంలో పనిచేస్తున్న కాండ్రేగుల రాధాకృష్ణ ఆత్మహత్యా ఉదంతం వైద్యాధికారి బదిలీకి దారి తీసింది. కుటుంబ సభ్యులు, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన సంఘ నేతలు రాధాకృష్ణ ఉదారత, ఉద్యోగంలో నిబద్ధతను వివరిస్తూ ఆయన సౌమ్యుడని, వైద్యాధికారి రూ.7 లక్షల నిధుల మొత్తంలో అవినీతికి పాల్పడబోతుంటే రాధాకృష్ణ అడ్డుకున్నారనీ, అందువల్లే తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేశారని వివరించారు. విచారణ అధికారి విచారణ చేపట్టకుండా రాధాకృష్ణ భార్య కుటుంబ సభ్యుల గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటని? డాక్టర్ సాయి రోహితతో కుమ్మక్కై, వ్యక్తిగత అజెండాతో విచారణ నిర్వహించి ఉద్యోగిని ఆత్మహత్యకు ప్రేరేపించిన నేరంపై పెద్దాపురం డివిజనల్ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కాకినాడ యూపీహెచ్‌సీలో పని చేసినప్పుడు కూడా ఆమె ఎల్‌టీని వేధించారని కలెక్టర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రాధాకృష్ణ కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. ఆమెను తక్షణమే బదిలీ చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీని విచారణ అధికారిగా నియమిస్తూ విచారణకు ఆదేశాలిచ్చారు. సంఘం తరఫున కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్‌రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, జిల్లా మినిస్టీరియల్ అధ్యక్షుడు వీరాజీ, కోశాధికారి రాజా, కాకినాడ పట్టణ సంయుక్త కార్యదర్శి శివప్రసాద్, రమేష్‌బాబు, స్టేట్ కౌన్సిలర్ షేక్ అజీజ్ ఉన్నారు. కాగా సాయి రోహితను తొండంగి మండలం కొత్త పెరుమాళ్లపురం పీహెచ్‌సీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మద్యం తాగి బైక్ నడిపిన 14 మందికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఐదుగురికి రెండు రోజులు జైలు, మరో తొమ్మిది మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ రెండో తరగతి మేజిస్ట్రేట్ వి.నరసింహారావు బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడలోని వివిధ ప్రాంతాలలో ట్రాఫిక్ 1, 2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి బైక్ నడుపుతున్న పలువురిపై సీఐలు ఎన్.రమేష్, చైతన్యకృష్ణ కేసులు నమోదు చేశారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పైవిధంగా తీర్పుచెప్పారు.

ఇసుక తరలిస్తున్న ముగ్గురిపై కేసు

నిడదవోలు: పట్టణంలోని జగనన్న కాలనీలో పేదల గృహ నిర్మాణాల కోసం డంప్ చేసిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. జగనన్న కాలనీలో డంప్ చేసిన ఇసుకను లోడ్ చేసుకుని లారీ, ట్రాక్టర్‌పై తరలిస్తుండగా స్థానికులు గమనించారు. వెంటనే పట్టణ హౌసింగ్ ఏఈ ఎలిపే వెంకన్నబాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకుని అక్రమ ఇసుక తరలింపును అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇసుకను తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌ను పట్టణ ఎస్సై పి.అప్పారావు సీజ్ చేశారు. చిట్టి రాంబాబు, ఉప్పులూరి రామకృష్ణ, మచ్చ చిన్నిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పార్వతి అమ్మవారి సారె ఉత్సవం



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

బిక్కవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతి అమ్మవారి సారె ఉత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా పుట్టింటి సారెను అందుకోవడానికి బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై క్షేత్ర పాలకుడైన లక్ష్మీ నారాయణస్వామి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సారెతో తిరిగి ఆలయానికి చేరుకున్నారు. సుమారు 300 మంది మహిళలు 200 కేజీల వివిధ రకాల స్వీట్లు, పండ్లతో పాటు అమ్మవారికి చీరలు, గాజులు, చలివిడి, పసుపు, కుంకుమ, కాటుక, రిబ్బన్, అద్దం వంటి వివిధ వస్తువులను సమర్పించారు. అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ, సన్నిధిరాజు కుమార వెంకట యోగి సుబ్రహ్మణ్యం శర్మ, బిక్కవోలు రాఘవరావు, కొడమంచిలి రఘు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలోని మాజీ వైస్ ఎంపీపీ తాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయం సిబ్బంది నామాల నాగ వర ప్రసాద్, కోళ్ల వీర కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: నగదు చోరీ చేసిన వ్యక్తికి 18 నెలల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్న లక్ష్మి బుధవారం తీర్పునిచ్చారు. కాకినాడ చెందిన దాసరి హరీష్ గతేడాది కాకినాడలోని చిత్ర అపార్ట్‌మెంట్‌లో రూ.1.60 లక్షలు చోరీ చేశాడు. ఈ ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో హరీష్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఆర్యాపురం ఎన్నికల్లో ధైర్యంగా పోటీచేశాం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఓడిపోయామని దిగులు పడొద్దు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: అధికారంలో లేనప్పటికీ ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పాలక వర్గం ఎన్నికలలో ధైర్యంగా పోటీ చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలోని సంహిత కన్వెన్షన్ హాలులో బుధవారం ఆర్యాపురం ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఏమాత్రం అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అధికారంలో ఉన్నపుడు నామినేటెడ్ పోస్టుల దగ్గర నుంచి చిన్న ఎన్నికల్లో సైతం పోటీకి చాలామంది ముందుకు రావడం సహజమన్నారు. కానీ అధికారంలో లేనప్పుడు కూడా ధైర్యంగా పోటీలో ఉన్న అభ్యర్థులను అభినందించారు. సాధారణ ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఇంకా కోడ్ అమల్లో ఉండగానే, ఆర్యాపురం బ్యాంకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందన్నారు. ప్రచారానికి సమయం తక్కువగా ఉండడం, అధికారంలో లేకపోవడం, వర్షాల నేపథ్యంలో అభ్యర్థులు కష్టపడ్డారని ఆయన అభినందించారు. ఆర్యాపురం ఎన్నికల్లో చాలామందికి ఓట్లు ఎలా వేయాలో తెలియని పరిస్థితి నెలకొందని, తన భార్య ఓటు వేయడానికి వచ్చి, ఎక్కడ వేయాలో తెలియక తిరిగి వెళ్లిపోయిందన్నారు. ఇక సిబ్బందిని కూడా భయపెట్టి తమకు అనుకూలంగా అధికార పార్టీ మలచుకుందన్నారు. పారదర్శకంగా బ్యాంక్ ఎన్నిక జరగలేదని విమర్శించారు. మన టీమ్‌లో తిరిగిన అశోక్ కుమార్ జైన్‌ను బెదిరించడం దారుణమన్నారు. జక్కంపూడి కుటుంబం ఎక్కడ ఉంటే అక్కడ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నట్లేనని అన్నారు. వివిధ కారణాల వల్ల సమావేశానికి రాలేకపోయినప్పటికీ ఎన్నికల్లో విశేష కృషి చేసిన పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, గిరజాల బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రుడా మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఎస్‌వీజీ మార్కెట్ చైర్మన్ నందెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం



ధవళేశ్వరంలో కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆకుల వీర్రాజు తదితరులు

ధవళేశ్వరం: ఆనకట్ట నిర్మాణం ద్వారా డెల్టాను ధాన్యాగారంగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. కాటన్ వర్ధంతి సందర్భంగా ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బుధవారం ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ తీవ్ర క్షామంతో అల్లాడుతున్న ఉభయ గోదావరి జిల్లాలను ఆనకట్ట నిర్మాణం ద్వారా కాటన్ సస్యశ్యామలం చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కుమార్, పందెళ్ల భానుప్రసాద్, శ్రీరంగం బాలరాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, బొడ్డేటి శివాజీ తదితరులు పాల్గొన్నారు.